ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ పరిధిలోని సమతానగర్ వెల్ఫనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆవిష్కరించారు. సమతానగర్ అసోసియేషన్ అధ్యక్షుడు లోహిదాస్, కార్యదర్శి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రామ్‌చందర్ రావు, సహాయ కార్యదర్శి ముధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
– అల్లాపూర్, డిసెంబర్ 28

కేసుల పరిష్కారంలో జీడిమెట్ల సీఎస్ ఫస్ట్

జీడిమెట్ల పోలీసులను అభినందిస్తూ.. రివార్డులు ఇస్తున్న బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్ కుమార్

జీడిమెట్ల, డిసెంబర్ 28: లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించడంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జీడిమెట్ల పోలీస్ స్టేషన్ మొదటి స్థానంలో నిలిచింది. ఈ నెలలో మొదటి వారంలో జరిగిన నేషనల్ అదాలత్‌తో అత్యధికంగా కేసులను రాజీ కుదుర్చడంలో జీడిమెట్ల పోలీసులు ప్రత్యేక చొరవ చూపారు. ఇందుకు హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్, కానిస్టేబుల్ నాగయ్య, రవి నాయక్, శ్రీకాంత్, హోంగార్డు మోహన్‌ను శనివారం బాలానగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్ కుమార్ అభినందించి రివార్డులను అందజేశారు.

పేదరికంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న లక్ష్మికి శనివారం హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న భారతీయ స్టేట్ బ్యాంక్ రీజియన్ మేనేజర్ వెంకట్ నారాయణ, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ భాస్కర్. – మాదాపూర్, డిసెంబర్ 28

మాదాపూర్‌లోని అన్నమాచార్య బావనా వాహినిలో పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నృత్య ప్రదర్శనలు చేసి అలరిస్తున్న కళాకారులు.
– మాదాపూర్, డిసెంబర్ 28

దశలవారీగా అభివృద్ధి పనులు

అల్లాపూర్, డిసెంబర్ 28: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ తెలిపారు. సోమవారం ఇందిరానగర్‌లో రూ.20 లక్షల వేయంతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో గౌస్‌భాయ్, అన్వర్, అష్జల్ కైసర్, హస్మతుల్లా ఖాన్, సంతోష్, ఆరిఫ్, బద్రి, శంకర్, ఉదయ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

అసంపూర్తి పనులపై దృష్టిసారించాలి..

జడ్సీకి వినతిపత్రం అందజేసిన కార్పొరేటర్

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 28: కేపీహెచ్‌బీ కాలనీలో అసంపూర్తి పనులపై దృష్టి సారించాలని, ఆయా ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్నా అభివృద్ధి పనులను పూర్తిచేయాలని కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు కోరారు. శనివారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో రోడ్లు, పార్కుల అభివృద్ధి, వర్షనీటి కాలువల మరమ్మతు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ పనులను తక్షణమే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై సానుకులంగా స్పందించిన జోనల్ కమిషనర్... ఆయా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జీడిమెట్ల, డిసెంబర్ 28: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఆదివారం జీడిమెట్ల సబ్ స్టేషన్-2 పరిధిలోని 11 కేవీ ఫేజ్-5 ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని షాపూర్‌నగర్ విద్యుత్ ఏఈ కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 11 కేవీ ఫేజ్-3 అపురూప కాలనీ, ఫేజ్-4 ఎన్ఆర్ఎస్ఏ ఉత్తమ్ బిస్కెట్, రెడ్డి ల్యాబ్స్, కేజేఆర్ పాలిమర్స్, ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫేజ్-3,4,5 జీడిమెట్ల పారిశ్రామిక వాడలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

జీడిమెట్ల సబ్ స్టేషన్ 1 పరిధిలో..

జీడిమెట్ల సబ్ స్టేషన్-1 పరిధిలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పి.ప్రసన్న తెలిపారు. షాపూర్‌నగర్, మెయిన్ రోడ్డు, ఎన్ఎల్‌బినగర్, సంజయ్ గాంధీనగర్, ఎపీఐఐసీ కాలనీ, కళావతినగర్, అయోధ్యనగర్ జీడిమెట్ల పారిశ్రామిక వాడలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

నిజాంపేటలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయంలో సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, అధికారులు

డబుల్ బెడ్‌రూం ఇండ్లలో..

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మౌలిక వసతులు కల్పించాలి

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 28: కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయంలో.. మౌలిక వసతులు కల్పించి, లబ్ధిదారులు నివసించేలా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఫిర్యాదు మేరకు.. శనివారం నిజాంపేటలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయంలో పర్యటించిన ఎమ్మెల్యే కృష్ణారావు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో సమాజంలోని నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలని డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించి.. అర్హులైన వారికి కేటాయించడం జరిగిందన్నారు. కాగా.. తన నియోజవర్గంలోని నిరుపేదలకు కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయంలోని సెల్లార్‌లోకి వరదనీరు చేరుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. తాగునీరు, విద్యుత్ సమస్యలతో పాటు డ్రైనేజీ సమస్యలను పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఆయా విభాగాల అధికారులు పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా వసతులను కల్పించాలన్నారు. ఇప్పటికే నిర్మాణ పనులను పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. నగరంలోని బస్తీల్లో నివసిస్తున్న పేదలు ఇండ్ల కిరాయిలు (అద్దెలు) చెల్లించలేక అవస్థలు పడుతున్నారని, అర్హులైన పేదలను గుర్తించి ఇండ్లను కేటాయించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో నిర్మాణ పనులు పూర్తయిన ఇండ్లను అర్హులైన పేదలకు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, నిజాంపేట కమిషనర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 28: కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్ ఫ్లైఓవర్ కింద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కేపీహెచ్‌బీ కాలనీ సెక్టార్ ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్‌లోని ఫ్లై ఓవర్ కింద ఓ వ్యక్తి కదలికలు లేకుండా ఉన్నాడని స్థానికంగా ఓ వ్యక్తి కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న కానిస్టేబుల్ అనిల్‌కుమార్ ఆ వ్యక్తిని పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. చేతిపై శ్రీత అనే పచ్చబొట్టు మాత్రమే ఉంది. ఇతర వివరాలు లభ్యం కాలేదు. కాగా.. ఈ వ్యక్తి గురించి ఆరా తీస్తే.. గుర్తు తెలియని వ్యక్తి రోడ్డుపై బిక్షాటన చేస్తూ.. మద్యం సేవించి ఫ్లైఓవర్ కింద పడుకుని జీవిస్తున్నాడని, ఈనెల 27న సాయంత్రం ఆ వ్యక్తికి ఫిట్స్ రావడంతో స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా.. ప్రాథమిక చికిత్స చేసినట్లు తెలిసింది. సరైన ఆహారం లేకపోవడం, అనారోగ్య కారణాలతో ఆ వ్యక్తి చనిపోయినట్లు ప్రాథమికంగా నిర్ధారించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కొండాపూర్, డిసెంబర్ 28: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని మహిళ అపస్మారక స్థితిలో ఉన్నట్లు సమాచారాన్ని అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి సదరు మహిళను పరిశీలించగా, మృతి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

శునకాలకు ఉచిత వ్యాక్సినేషన్

దుండిగల్, డిసెంబర్ 28: బ్లూ క్రాస్ సొసైటీ, దుండిగల్ మున్సిపల్ అధికారులు సంయుక్తంగా శనివారం పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు ఉచితంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అయా వార్డుల పరిధిలోని 229 వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్ చేశారు. అదేవిధంగా 28 వీధి కుక్కలను స్టెరిలైజేషన్ సెంటర్‌కు పంపించారు. మున్సిపల్ కమిషనర్ కే.సత్యనారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి ప్రభాకర్, వెటర్నరీ డాక్టర్ శైలజ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచందర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వడ్డెర బస్తీలోని పీజేఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జూపల్లి సత్యనారయణ, తూము శ్రావణ్‌కుమార్

పీజేఆర్‌కు ఘన నివాళి

మూసాపేట, డిసెంబర్ 28: మూసాపేట డివిజన్ పరిధి గూడ్స్ షేడ్ రోడ్డు, వడ్డెర బస్తీలో పీజేఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారయణ, మూసాపేట కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ హాజరై పీజేఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. పేదల పక్షాన నిలబడి.. వారి అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు కర్క పెంటయ్య, జిల్లా గోపాల్, కర్క రవీందర్, తుకారాం, విష్ణు, జెల్ల రాము, డాకయ్య, ఇనుగంటి రాజు, శివశంకర్, రవిసింగ్, వెంకటస్వామి, అరుణ్, కృష్ణ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేటలో పీజేఆర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, బీఆర్ఎస్ పార్టీ నేతలు భాస్కర్‌రావు, సుశీల్‌కుమార్ తదితరులు.
– కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 28

పేకాట ఆడుతున్న వ్యక్తుల అరెస్ట్

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 28: ఓయో రూమ్‌లో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేశారు. కేపీహెచ్‌బీ కాలనీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగుట్ట సమతానగర్‌లోని ఎన్ గ్రాండ్ ఓయో రూమ్‌లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు... శనివారం ఆకస్మికంగా దాడులు చేసి.. పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులు తెలుగు జనార్దన్, పొందురి సురేశ్, పుల్లయ్యగారి శ్రీనివాస్‌రెడ్డి, దాసరి కృష్ణారెడ్డి, గంగధర్ జగన్, కొలన్ నర్సింహారెడ్డి, బేగరి రవిని ఆదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,78,160ల నగదు, 4 సెట్ల ప్లెయింగ్ కార్డులు, 7 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 28: కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులోని టాకింగ్ బ్రిక్స్, ట్వింకిల్ స్టార్స్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో రోడ్లపై నిద్రించే నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. అర్ధరాత్రి వేళా.. కేపీహెచ్‌బీ కాలనీతో పాటు కింగ్‌కోఠి, కోఠి, సుల్తాన్‌బజార్‌లోని వైద్యశాలలు, రోడ్ల పక్కన పుట్‌పాత్‌పై నిద్రించే అనాథలను గుర్తించి 200 మందికి ఫౌండేషన్ చైర్మన్ దుర్గాదేవి, ఎండీ గోపి యాదవ్ దుప్పట్లను పంపిణీ చేశారు.

విద్యుత్ ఉద్యోగి రామారావుకు నివాళులు

కూకట్‌పల్లి విద్యుత్ డివిజనల్ కార్యాలయంలోని ఈఆర్‌వో విభాగంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ రామారావు ఆనారోగ్యంతో మృతి చెందాడు. కాగా... శనివారం ఉదయం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(1104) రాష్ట్ర ఉపాధ్యక్షుడు జేవీ.రామ్మోహన్ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీలోని కూకట్‌పల్లి, కొండాపూర్, గౌచ్చిబౌలి డివిజన్‌ల విద్యుత్ కార్యాలయంలో మృతి చెందిన రామారావు చిత్రపటానికి విద్యుత్ ఉద్యోగులు పూలతో నివాళులర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జేవీ.రామ్మోహన్, పి.కోటేశ్వర్‌రావు, రఘు, వెంకటేశ్, ఇందిరా, పలువురు విద్యుత్ ఉద్యోగులు ఉన్నారు.
– కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 28

కారు ఢీకొని వ్యక్తి మృతి

గణేశ్ (ఫైల్)

మాదాపూర్, డిసెంబర్ 28: విధులు ముగించుకొని ఇంటికి వస్తుండగా వెనకాల నుంచి కారు ఢీ కొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శనివారం మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్ వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కె సముద్రంకు చెందిన గణేశ్(34) నగరంలోని ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈనెల 28న ఉదయం గణేశ్ నైట్ డ్యూటీ ముగించుకొని మాదాపూర్‌లోని 100 ఫీట్ రోడ్డులో బైక్ పై ఇంటికి వస్తుండగా వెనకాల నుంచి నిర్లక్ష్యంగా వచ్చిన కారు బలంగా ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో అతడి భార్య జి.పార్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని.. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిజాంపేటలోని చెత్త డంపింగ్ కేంద్రం వద్ద పర్యటిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

వసతులు కల్పించి.. ఆదర్శంగా తీర్చిదిద్దుతా

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్, డిసెంబర్ 28: ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించి.. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ తెలిపారు. శనివారం 15వ డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటించగా.. పత్తికుంట చెరువు వద్ద ధోబీఘాట్ నిర్మాణం, క్రిస్టియన్ గ్రేవ్‌యార్డ్‌లో ప్రహరీగోడ, బోర్‌వెల్ వసతి, ఎస్ఆర్ జూనియర్ కాలేజ్ నుంచి సాయిబాబా దేవాలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం, చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు వంటి వసతులను కల్పించాలని కార్పొరేటర్ గాజుల సుజాత కోరారు. అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో నిజాంపేట్ కార్పొరేషన్‌ను ఎంతో అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లోనూ మరిన్ని నిధులతో మెరుగైన మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. క్రిస్టియన్ శ్మశానవాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి వెంటనే పనులను చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కమిషనర్ ఎండీ.సాబెర్ అలీ, బాచుపల్లి డిప్యూటీ తాసీల్దార్ ప్రభుదాస్, బీఆర్ఎస్ పార్టీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు బాలాజీ నాయక్, రవికిరణ్, ఆగం రాజు, బొర్ర దేవిచందు ముదిరాజ్, వాటర్‌వర్క్స్ డీజీఎం చంద్రమౌళి, మేనేజర్ సౌమ్య, ఎన్విరాన్‌మెంటల్ ఏఈ సుకృతారెడ్డి, వివిధ శాఖల అధికారులు, పలు డివిజన్ల అధ్యక్షులు, స్థానిక నాయకులు, బస్తీ వాసులు పాల్గొన్నారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సర్వేనంబర్ 186లోని చెత్త డంపింగ్ యార్డును పరిశీలించారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న దుర్గంధాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు

దుండిగల్, డిసెంబర్ 28: బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ప్రజలు, సంక్షేమసంఘాల నేతలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి.. స్థానికంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు.

కమనీయం.. నృత్య విన్యాసం

నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

కొండాపూర్, డిసెంబర్ 28: ఓ వైపు శాస్త్రవేత్తగా సేవలందిస్తూ.. మరో వైపు సాంస్కృతిక నృత్యరీతులపై తనకున్న మక్కువతో నాసా శాస్త్రవేత్త, ప్రముఖ భరతనాట్య కళాకారిణి డాక్టర్ కావ్య శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో తన నృత్య ప్రదర్శనలతో సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నది. హౌస్టన్‌లోని నాసా స్పేస్ సైంటిస్ట్‌గా సేవలందిస్తున్న కావ్య మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న ఆలిండియా క్రాఫ్ట్స్ మేళాలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనల్లో పుష్పాంజలి, ఓంకార కారిణి, జయ్ మాధవ మదన, తిల్లాన అంశాలను భరతనాట్య నృత్యరూపకంలో ప్రదర్శించి ఆకట్టుకున్నది. అనంతరం కూచిపూడి నాట్య గురువు ప్రవల్లిక తన శిష్య బృందంతో కలిసి పలు అంశాలను కూచిపూడి నృత్యరూపకంలో ప్రదర్శించి ఆకట్టుకుంది.

పచ్చని చెట్టు.. బతికేటట్టు

● రహదారి విస్తరణలో వృక్షాలు పదిలం
● 90 చెట్ల ట్రాన్స్‌లొకేషన్‌కు చర్యలు
● వేర్వేరు చోట్ల నాటేందుకు ప్రాంతాల ఎంపిక

హైటెక్‌సిటీ వంతెన నుంచి శిల్పారామం వెళ్లే దారిలో యశోద దవాఖాన ఎదుట రహదారిపై చెట్లు

మియాపూర్, డిసెంబర్ 28: నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్ నేపథ్యంలో శేరిలింగంపల్లి జోన్‌లో రహదారుల విస్తరణ అత్యావశ్యకమైంది. దీంతో ఆస్తుల సేకరణ అత్యంత ప్రధానమైన అంశం కావటంతో అధికారులు ఆ మేరకు తగు ప్రయత్నాలు చేస్తున్నారు. శేరిలింగంపల్లి జోన్‌లో అత్యధికంగా ఐటీ పరిశ్రమలు ఉండటం.. నిత్యం లక్షలాది మంది కార్యాలయాలకు రాకపోకలు సాగిస్తుండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో రహదారులు అత్యంత రద్దీగా మారుతున్నాయి. ప్రధానంగా కూకట్‌పల్లి.. శేరిలింగంపల్లి నియోజకవర్గాలకు కీలక వారధిగా ఉన్న హైటెక్ సిటీ వంతెన నుంచి శిల్పారామం, దుర్గం చెరువు, టీ హబ్, బయోడైవర్సిటీ ప్రాంతాలకు నిత్యం వేలాది వాహనాలు ప్రయాణాలు సాగిస్తున్న తరుణంలో ప్రధానంగా యశోద దవాఖాన ఎదుట ఇరుకైన రహదారితో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. దీంతో అధికారులు యశోద దవాఖాన ఎదుట రహదారి విస్తరణ పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. అయితే రహదారి విస్తరణలో భాగంగా సుమారు 90 చెట్లు దారి మధ్యలోకి వచ్చాయి. రహదారి విస్తరణ పేరిట వాటిపై వేటు వేయకుండా.. వాటిని సంరక్షించి మరోచోట నాటే ప్రయత్నాన్ని అధికారులు చేపడుతున్నారు. ఈ మేరకు చెట్ల ట్రాన్స్ లొకేషన్‌కు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి ఆర్థిక అనుమతుల కోసం నివేదించారు. సురక్షిత పద్ధతిలో 90 చెట్లను వేర్వేరు ప్రాంతాల్లో నాటేందుకు అధికారులు ఇప్పటికే ప్రాంతాలను ఎంపిక చేశారు. అయితే కొండాపూర్ కూడలిలోనూ రహదారి విస్తరణలో పలు చెట్లు రహదారిపైకి వచ్చినప్పటికీ వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. రహదారుల విస్తరణ పేరుతో చెట్లను నరికేయకుండా సంరక్షించటమే కాకుండా.. ట్రాన్స్‌లొకేట్‌కు చర్యలు చేపడుతుండటం పట్ల ప్రకృతి ప్రేమికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా జోనల్ కార్యాలయం ఎదుట సైతం రహదారి విస్తరిస్తున్న అధికారులు.. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా దారి మధ్యలో గ్రీనరీని ఏర్పాటు చేసే యోచనలో ఉన్నారు. రహదారి విస్తరణలో భాగంగా ఏ ఒక్క చెట్టును కొట్టబోమని తప్పకుండా సంరక్షిస్తామని జడ్సీ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు.